# పంజరం ఎరుగని చిలక

సాయంకాలపు నీరెండ చెట్ల ఆకుల సందుల్లోంచి పులుపు తగిలి విరిగి పోయిన పాలలా ముక్కలు క్రింద విడిపోయి తీగెలుగా సాగి భూమిని తాకుతుంది. చెట్లకొమ్మల చాటున, ఆకుల మాటున ఎక్కడో కోయిల 'కో' యని పిలుస్తూంటే మరో కోయిల 'కో' యని బదులు పలుకుతూంది. వాటి అనురాగాల్ని హర్షిస్తున్నట్లుగా చెట్లు తలలు ఊపుతున్నాయి. పిల్లగాలికి పూలు పులకరిస్తున్నాయి. మల్లె పూవుల్లా తెల్లగా ఉన్న కొంగలు ఎండకు మెరుస్తూ పడమటి వైపు స్వేచ్ఛగా ఎగురుకుంటూ వెళుతున్నాయి. వాటిని పరధ్యాన్నంగా చూస్తే గాలిలో దూదిపింజలు తేలుతూ ఎటో కొట్టుకు పోతున్నట్లు అనిపిస్తుంది.

రకరకాల మనుషులతో కళకళ లాడుతుంది ఆపార్కు. పార్కులో ఎంత సందడగా ఉన్నా తమకేం పట్టనట్లు మూలగా ఒక సిమ్మెంటు బెంచిమీద కూర్చుని పూర్వానుభవాల్ని పునరుశ్చరణ చేసుకుంటున్నారు ఇద్దరు వృద్ధ దంపతులు జనం పచ్చికమీద గుంపులు గుంపులుగా కూర్చుని కబుర్లు చెప్పుకుంటున్నారు. యువకులు కొందరు, చెట్టా పట్టాలు వేసుకుంటూ పార్కులోని రోడ్ల వెంబడి నవ్వుతూ తుళ్లుతూ తిరుగుతున్నారు. చిన్న పిల్లలు గడ్డిలో పిల్లి మొగ్గలు వేస్తూ, గెంతుతూ, దొర్లుతూ వాళ్ళకి ఇష్టమైన విధంగా ఆడుకుంటున్నారు.

రవీంద్ర, శారద వచ్చికలో కూర్చున్నారు. వాళ్ళ బ్బాయి కృష్ణ వాళ్లముందు బుద్ధిగా బాసింపట్టు వేసుకుని కూర్చున్నాడు. కృష్ణ వాళ్ల ఏకైక పుత్రుడు. కష్ణను మంచి క్రమశిక్షణతో పెంచుతున్నారు వాళ్ళు. క్రమశిక్షణ లేని జీవితం గతుకుల రోడ్డుమీద ఎద్దులబండి నడకలాంటి దైతే, అతిగా క్రమశిక్షణ ఉన్న జీవితం పంజరంలోని చిలక బ్రతుకులాంటిది. మనిషి మనసులో ఎన్నో కోర్కెలు ఉంటాయి. కాని సమాజానికి, సాంఘికమైన కట్టుబాట్లకి వెరచి అతను తన మనసులోని తీర్చుకోగల అతి చిన్న కోర్కెను సహితం బలవంతాన అణుచుకుంటూ క్రమశిక్షణ పేరుతో తన కున్న స్వేచ్ఛను చంపుకుంటాడు.

రవీంద్ర శారదలకు కొద్ది దూరంలో పిల్లలు కేరింతలు కొడుతూ ఆడుకుంటున్నారు. అందరూ అయిదు, ఎనిమిది ఏళ్ల మధ్యలో ఉన్న వాళ్లే! వాళ్లందరి మధ్యలో చుక్కల్లో చంద్రుడిలా పన్నెండేళ్ల వయసు గల ఒక అబ్బాయి ఉన్నాడు. ఆ అబ్బాయి చూడ ముచ్చటగా ఉన్నాడు. వాడు కట్టుకున్న బట్టలు నలిగిపోయి మాసిపోయి ఉన్నాయి. జుట్టుకి తైల సంస్కారం లేదు. వెంట్రుకలు నొసలుమీద జీరాడుతున్నాయి. నవ్వినప్పుడు బుగ్గలు సొట్టబడుతున్నాయి. అక్కడున్న మిగతా పిల్లలు అందరూ చాలా నీట్‌గా డ్రెస్ చేసుకుని టాయిలెట్ అయి ఉన్నా వీడే అందరికంటే అందంగా ఉన్నాడు వాళ్ళ అందర్నీ ఆడిస్తూ నవ్విస్తూ వాళ్లకి నాయకుడిలా ప్రవర్తిస్తు న్నాడు. కృష్ణ వాళ్ల ఆటలను చూస్తూ ఆనందిస్తున్నాడు. ఆ పిల్లల నాయకుడు ఒక్కొక్కళ్ళని రెక్కలు పట్టుకుని గిరగిర తిప్పుతున్నాడు. మిగతా పిల్లలు చుట్టూ చేరిగంతులు వేస్తూ

చప్పట్లు కొడతున్నారు. కృష్ణ వాళ్ళ అమ్మా నాన్నల వైపు చూశాడు. వాళ్లేమో మాట్లాడుకుంటున్నారు. మళ్ళీ పిల్లల వైపు చూశాడు. ఈ సారి వంతు తనదంటే తనదని పిల్లలు తమ నాయకుడి చుట్టూ చేరి, నన్నే తిప్పు. ..."నన్నే తిప్పు" అంటూ చేతులు చాచుతున్నారు.

"అమ్మా!"

శారద రవీంద్రలు కృష్ణ వేపు చూశారు. కృష్ణ పిల్లల వేపు చేయిచూపించాడు.

"నేనుకూడా ఆడుకుంటానే!"

"వద్దుబాబూ... బట్టలు మాసిపోతాయి... ఇదిగో, ఈ చాకలెట్లు తీసుకో."

శారద చేతిలోంచి చాకలెట్లు తీసుకున్నాడు కృష్ణ. ఒకసారి తన తెల్లని బట్టలకేసి చూసుకుని చాకలెట్లు తినడం మొదలు పెట్టాడు. శారద రవీంద్రలుకూడా పార్కుకి వచ్చినప్పటినుండి ఆ పిల్లలను చూస్తున్నారు. వాళ్ళందరిలోకి ఆ అబ్బాయి వాళ్లను అమితంగా ఆకర్షించాడు. దానికి కారణం ఆ అబ్బాయి అందం కావచ్చు. లేదా అతని చలాకీతనం కావచ్చు. కారణం ఏమైనా వాళ్ళను ఆ అబ్బాయి మాత్రం అమితంగా ఆకర్షించాడు.

ఈ సారి ఇంకో పిల్లవాడి రెక్కలు పట్టుకుని గిరగిర త్రిప్పుతున్నాడు ఆ అబ్బాయి మిగతా పిల్లలు చప్పట్లు కొడుతూ తమ సంతోషాన్ని ప్రకటిస్తున్నారు. వాళ్ళు చప్పట్లు కొడుతున్న కొద్దీ ఆ అబ్బాయిలో ఉత్సాహం పెరిగింది. ఇంకా

జోరుగా త్రిప్పడం మొదలు పెట్టాడు. ఇంకా జోరుగా... ఇంకా... ఇంకా...

"కెవ్వ్"మని అరచి ఆ అబ్బాయి చేతిలోంచి జారి అంత దూరంలో పడ్డాడు ఆ చిన్న పిల్లవాడు. వాడు ఏడుపు లకించుకున్నాడు. ఆ అబ్బాయి బిత్తరపోయి చూస్తున్నాడు. మిగతా పిల్లలు చప్పట్లు కొట్టడం మానేసి భయంగా చూస్తున్నారు. ఇంతలో ఒక లావుపాటి ఆవిడ అక్కడికి దూసుకుంటూ వచ్చి ఆ అబ్బాయి చెంప ఛెళ్ళుమనిపించింది. ఆ అబ్బాయి తూలి క్రింద పడ్డాడు. రవీంద్ర పరుగున అక్కడికి వెళ్లి ఆ అబ్బాయిని లేవనెత్తాడు. ఆ లావుపాటి ఆవిడ రవీంద్ర చేతుల్లో ముఖం దాచుకుని ఏడుస్తున్న ఆ అబ్బాయిని మరొకసారి తృప్తితీర తిట్టిపోసి ఏడుస్తున్న చిన్న పిల్లవాడ్ని జబ్బ పట్టుకుని లేవదీసి వాడి నెత్తిని రెండు మొట్టి బరబరా లాక్కెళ్ళిపోయింది. పిల్లలందరూ చెల్లాచెదురైపోయి ఎవరి అమ్మా నాన్నల దగ్గరకు వాళ్ళు వెళ్లిపోయారు.

రవీంద్ర శారదకి ఎదురుగా కూర్చున్నాడు. ఆ అబ్బాయి చేతుల్లో ముఖం దాచుకుని నిలుచున్నాడు. కృష్ణ వింతగా ఆ అబ్బాయి వేపు చూస్తున్నాడు.

"కూర్చోవోయ్..."

చేతులు ముఖం మీద నుండి తియ్యకుండనే అలానే మోకాళ్ల మీద కూర్చున్నాడు అతడు. శారద జాలిగా అబ్బాయి వైపు చూసింది. రవీంద్ర వాడి ముఖంమీది చేతులు తొలగించి వేశాడు. వాడి కళ్లనుండి అశ్రువులు స్రవిస్తు

న్నాయి. చెంపమీద వేళ్ల ముద్ర పడింది. శారద గుండె జాలితో నిండిపోయింది.

"ఊరుకోరా... ఊరుకో... ఆవిడను పోలీసులకు అప్ప జెప్పుదాం లే." రవీంద్ర వాడి కన్నీళ్ళను తన కర్చీఫ్‌తో తుడిచాడు. కృష్ణ వాడివైపు చాకలెట్లు ఉన్న చేతిని చాపాడు. వాడు అడ్డంగా వద్దన్నట్లు తలఊపాడు. కృష్ణ వాళ్ళ అమ్మానాన్నల వైపు చూశాడు.

"తీసుకో బాబూ..." శారద వాడితల నిమిరింది.

వాడు కృష్ణ చేతిలోంచి ఒక్క చాకలెట్ తీసుకున్నాడు. కృష్ణ కళ్ళు మెరిశాయి.

"నీ పేరేమిటి బాబూ?" రవీంద్ర కొనదేలి అందంగా ఉన్న వాడి ముక్కు వైపు చూస్తూ అడిగాడు.

వాడు బిత్తరపోయి చూశాడు.

'చెప్పు బాబూ... నీ పేరేమిటి?' శారద వాడి వీపు నిమురుతూ అడిగింది.

'ప్రశాంత్'!

"చాలా బాగుంది! మరి నువ్వు ఒక్కడివే పార్కుకి వచ్చావా?" రవీంద్ర వాడి పెద్ద పెద్ద కళ్లలోకి చూస్తూ అడిగాడు. వాడు అవునన్నట్లు తల ఊపాడు.

'నువ్వు ఎక్కడ ఉంటున్నావు?' తలవంచుకున్నాడు ప్రశాంత్.

'నువ్వు ఎక్కడ ఉంటావో చెప్పు.' గడ్డం క్రింద చెయ్యి పెట్టి ముఖం పైకి ఎత్తి అడిగింది శారద.

"ఇక్కడే." అతి కష్టం మీద ఆ ఒక్కమాట పెగిలి వచ్చింది. వాడి నోటివెంట.

'అంటే? ! !'

"ఈ పార్కులోనే."

'నీకు అమ్మా, నాన్నా ఎవ్వరూ లేరా?'

తల వంచుకున్నాడు ప్రశాంత్. వాడి కళ్ళు వర్షిస్తున్నాయి రెండు చేతులలో ముఖం దాచుకున్నాడు. శారద రవీంద్రలు ఒకరి ముఖం ఒకరు చూచుకున్నారు. ఏదో భావం వాళ్లిద్దరి కన్నుల్లో ప్రతిఫలించింది.

రవీంద్ర ప్రశాంత్ ముఖంమీదినుండి చేతులు తొలగించాడు.

"మా ఇంటికి వస్తావా, ప్రశాంత్?"

రానన్నట్లు తల అడ్డంగా తిప్పాడు.

"నీ కేం భయం లేదు ప్రశాంత్, మా ఇంటికి రా... నీకు మంచి మంచి బట్టలు, బొమ్మలు కొనిపెడతాం... నువ్వు మా ఇంట్లో కృష్ణతో కలిసి ఆడుకోవచ్చు...అంతగా తరవాత నీకిష్టం లేకపోతె వెళ్లిపోవచ్చు...ఏం? మా ఇంటికి వస్తావా?" వాడి కళ్ళలోకి చూస్తూ అడిగింది శారద.

వాడి కళ్ళలోని భయం, సందేహం పోయాయి. ఒకసారి శారద రవీంద్ర ఇద్దరి ముఖాల్లోకి చూశాడు.

"ప్రశాంత్... మా ఇంటికి రావూ? నాతో ఆడు కోవూ?" అంటూ దీనంగా కోరాడు కృష్ణ. ప్రశాంత్ తన ఇంటికి వస్తే తననుకూడా గిరగిర తిప్పుతాడని కృష్ణ ఆశ.

ప్రశాంత్ సరేనన్నట్లు తల ఊపాడు. రవీంద్ర తేలికగా శ్వాస పీల్చుకున్నాడు. పార్కులో రంగుదీపాలు గుప్పున వెలిగాయి. వాటి రంగులు ప్రశాంత్ ముఖంమీద ప్రతిఫలించి వింత అందాన్నిస్తున్నాయి. రవీంద్ర చేతి వాచివంక చూశాడు. సాయంత్రం ఆరున్నరైంది. అప్పుడే నిశాకన్య తన నల్లని పమిటను భూమిమీదకు మెల్లమెల్లగా జారుస్తూంది ఆకాశం లోని పూర్ణచంద్రుణ్ణి చూస్తే పమిట తొలగి ఆమె వక్షం బయట పడినట్లు ఉంది. పార్కులో జనం పల్చబడుతున్నారు. రవీంద్ర, శారద, ప్రశాంత్, కృష్ణ లేచి కారువైపు నడిచారు.

కారు ఒక బంగళాముందు ఆగింది. కారులోంచి నలుగురూ దిగి లోపలికి వెళ్ళారు. అది పెద్ద రెండంతస్తుల మేడ. ఖరీదైన ఫర్నిచరు అన్నిగదుల్లో అందంగా అమర్చబడి ఉంది. నలుగురూ హాలులోకి వచ్చారు. హాలు మధ్య ఒక అందమైన పంజరం. అందులో అంతకంటే అందమైన చిలక ఉన్నాయి. ప్రశాంత్ పంజరం దగ్గరికి వచ్చి ఆగిపోయాడు. పంజరాన్ని, దానిలోని చిలకను చూస్తూ నిలుచున్నాడు. మానవనైజం చాలా చిత్రమైనది. కృత్రిమంలో ఏదో పిచ్చి అందాన్ని వెతుక్కుంటాడు మానవుడు. స్వేచ్ఛను బంధించి నందుకు ఏడవక పిచ్చివాడిలా నవ్వుతాడు.

"ఏమిటి ప్రశాంత్, అలా చూస్తున్నావ్? అది మేము

పెంచుతున్న చిలక... దానికి మాటలు కూడా వచ్చు" అన్నాడు కళ్ళు తిప్పుతూ కృష్ణ.

"దాని పేరడుగు ప్రశాంత్...చెప్పుతుంది..." శారద ప్రశాంత్‌ను ముందుకు తోసింది.

"నీ పేరేమిటి?"

"సుందరి...సుందరి..." రామచిలక ముద్దు ముద్దుగా పలికింది. వాళ్ళు ముగ్గురూ నవ్వారు. ప్రశాంత్ నవ్వలేదు.

"దానికేం కావాలో కూడా అడుగూ!" రవీంద్ర అన్నాడు.

"నీ కేం కావాలి?"

"జాంపండు...జాంపండు."

మళ్ళీ ముగ్గురూ నవ్వారు. ప్రశాంత్ ఈ సారికూడా నవ్వలేదు. ప్రశాంత్‌ని చూసి శారద రవీంద్రలు ఒకరి ముఖం ఒకరు చూసుకున్నారు. ప్రశాంత్ కళ్ళలో ఏదో భావం మెదిలింది. రామచిలకను వాడు తదేకంగా చూస్తున్నాడు. వాడి కళ్ళలోని భావాలు వారికి అవగతం కాలేదు. ప్రశాంత్ ఇందాక పార్కులో గలగల పారే సెలయేరులా ఉంటే ఇప్పుడు గంభీర మైన సముద్రంలా ఉన్నాడు.

"లోపలికి పోదాం రండి..." శారద ఇంటిలోకి దారి తీసింది. ముగ్గురూ ఆమెను అనుసరించారు.

అదిరి పడ్డారు శారద రవీంద్రలు! నోటిలో పెట్టుకో బోయిన ముద్దలు అలానే చేతిలో ఉంచుకుని ప్రశాంత్ వైపు

చూశారు. వాడు తలవంచుకుని తన మానాన తాను భోజనం చేస్తున్నాడు. ఇద్దరూ ఒకరి ముఖం ఒకరు చూసుకున్నారు. వాళ్ల కళ్లలో ఆశ్చర్యం కదలాడింది. వాళ్లిద్దరినీ ఇంతగా ఆశ్చర్యపరిచిన విషయం ఏమిటంటే వాడు కూరతింటూ మాఅమ్మ చేసిన కూర ఇంత రుచిగా ఉండదు అని అనడం.

భోజనం ముగించి, డాబామీద వెన్నెల్లో కూర్చున్నారు. కృష్ణకూడా వాళ్లతోబాటు కూర్చున్నాడు.

'కృష్ణా... ఇప్పుడు చదువుకునే సమయంకదా?... వెళ్లి చదువుకో?" రవీంద్ర కృష్ణను ఉద్దేశించి అన్నాడు.

కృష్ణ ఏడుపు ముఖం పెట్టాడు. వాడికి తన కొత్త స్నేహితుడితో మాట్లాడాలని కథలూ అవీచెప్పుకోవాలని ఉంది.

"వెళ్లమ్మా...బుద్ధిగా చదువుకోవాలి...నువ్వు బాగా చదువుతే వచ్చే సంవత్సరం మూడోక్లాసుకి వస్తావు. తరువాత నాలుగు...ఆ తరవాత ఐదు...కొన్నాళ్లకి పెద్ద డాక్టరువి అయిపోతావు...కదూ?" శారద అనునయించింది.

కృష్ణ అయిష్టంగా లేచి వెనక్కు తిరిగి ప్రశాంత్‌ని చూస్తూ డాబా దిగి క్రిందకు వెళ్లిపోయాడు.

"ప్రశాంత్! నీకు అమ్మా, నాన్నా ఉన్నారా?" రవీంద్ర అడిగాడు. శారద కుతూహలంగా ముందుకు వంగింది.

ఉన్నారన్నట్లు తల ఊపాడు.

"ఎక్కడ ఉంటారు?" ఇది శారద ప్రశ్న.

ఏదో ఊరు పేరు చెప్పాడు. శారద రవీంద్రలు ఆశ్చర్య

పోయారు. అక్కడికి సుమారు మూడువందలమైళ్ళ దూరం ఉంది ఆ ఊరు

"మీ నాన్నగారు ఏం చేస్తుంటారు?"

"తాసిల్దారు."

శారదా రవీంద్రలకు ప్రశాంత్ చెప్పే ప్రతి విషయం ఆశ్చర్యాన్ని కలిగిస్తూంది. వాళ్లిద్దరూ ఇంకా చాలా ప్రశ్నలు వేసి ప్రశాంత్ నుండి తెలుసుకున్న విషయాలేమిటంటే—

ప్రశాంత్ తల్లి దండ్రులు సీతమ్మ రాఘవరావులు. వాళ్లకి ప్రశాంత్ కాక ప్రశాంత్‌కంటే పెద్దవాళ్లయిన ఇద్దరాడ పిల్లలు. ప్రశాంత్‌కంటే చిన్నవాడైన ఒక మగపిల్లవాడు ఉన్నారు. కాని అందరిలోకి ప్రశాంత్ అంటే వాళ్లకి ఎక్కువ ఇష్టం. రాఘవరావుగారు తాసిల్దారుగా చాలా సంపాదించారు. ప్రశాంత్ మొదటినుండి మొండివాడు. తన ఇష్టప్రకారం ప్రవర్తించేవాడు. రాఘవరావుగారికి తన ఆఫీసులో పనిచేసే గుమాస్తాల పిల్లలతో ప్రశాంత్ స్నేహం చేయడం ఇష్టంలేదు. ప్రశాంత్‌ని ఎవరితోపడితే వాళ్లతో స్నేహంచేయవద్దని శాసించే వాడు. అయినా వాడు ఆయన మాటలను నిర్లక్ష్యంచేసేవాడు. క్రమశిక్షణా లోపం రాఘవరావుగారు సహించ లేరు. కాని, ప్రశాంత్ మీద అమితమైన ప్రేమ ఉండటంవల్ల ఏమీ చేయ లేకపోయేవాడు.

ప్రశాంత్ రాఘవరావుగారికి పెద్ద సమస్యక్రింద తయా రయ్యారు. గొడ్లు కాచే కుర్రవాళ్లతో తిరిగి గేదెల మీదెక్కి షవారిచేసేవాడు. ఏమైనా అంటే అలిగి అన్నం తినేవాడుకాదు.

ఇంటిలో ఏపిల్ పళ్ళు, బత్తాయిలు, కమలాలు ఇంకా అనేక రకాల పళ్ళున్నా బడి ఎగ్గొట్టి ఊరి పొలిమేరకు వెళ్ళి అక్కడ ఈతచెట్లు ఎక్కి ఈతకాయలు కోసుకుని గొడ్లమీదెక్కి సవారీ చేస్తూ తినేవాడు. రెండుసార్లు ఇంటినుండి పారిపోయాడు కూడా రెండుసార్లూ వాళ్ల జవాన్లకి చుట్టుపక్కలవున్న పల్లెటూళ్లలో దొరికాడు. విసుగెత్తిన రాఘవరావుగారు ప్రశాంత్ విషయంలోకూడా కఠినమైన చర్యలు తీసుకుని, ప్రశాంత్‌ని కట్టుదిట్టాలలో పెట్టాడు. దాని ఫలితమే ప్రశాంత్ మూడవసారి ఇంటిలోనుంచి పారిపోవడం! ఈ సారి ఏకంగా రైలెక్కి దూరంగా పారిపోయి వచ్చేశాడు. ఒక హోటలులో క్లీనరుగా చేరాడు. పొద్దున్న ఆరు గంటలనుండి మధ్యాహ్నం రెండు గంటలవరకూ అక్కడ పనిచేస్తాడు. తరవాత తన ఇష్టం వచ్చిన చోట తిరుగుతాడు. రాత్రి ఏ పార్కులోనో లేదా ఏ ఇంటి అరుగుమీదనో నిద్రపోతాడు. రెండు నెలల క్రితంనుండి శారదా రవీంద్రలు కలిసేదాక వాడు అలానే రోజులు గడిపాడు.

శారద ప్రశాంత్‌వైపు జాలిగా చూస్తూంది. రవీంద్ర దీర్ఘంగా ఆలోచిస్తున్నాడు. ప్రశాంత్ ఆవులించాడు. వాడికి కళ్ళు మూతలు పడుతున్నాయి.

"ఇంక నిద్ర పోదాం, పదండి..." శారద లేచింది. ముగ్గురూ డాబా దిగి క్రిందికి వెళ్ళారు.

"ప్రశాంత్ నిద్రపోయాడా?" రవీంద్ర అడిగాడు.

'ఆఁ... నిద్రపోయాడు అది సరే గాని తరవాత కర్తవ్యం ఏమిటి?... రేపు వాడిని రైలు ఎక్కించి వాళ్లఊరు

పంపించేద్దామా?' నిద్ర పోతున్న కృష్ణమీద దుప్పటి కప్పుతూ అడిగింది శారద.

'నీ పిచ్చిగాని... ఇంటినుండి పారిపోయి వచ్చిన వాడు మళ్లీ బుద్దిగా ఇంటికి వెళతాడా? రేపు వాళ్ళ నాన్నగారికి టెలిగ్రాం ఇస్తాను... లేదా ట్రంకాల్ లో మాట్లాడతాను... అతనువచ్చి వీడిని తీసుకెళతారు... ఏమంటావ్?

'అవును... అలాచేస్తే బాగుంటుంది.'

కిటికి దగ్గర ఏదో నీడ కదిలింది.

అనంతకోటి జీవరాసులలో చైతన్యాన్ని కలిగిస్తూ సూర్యుడు ఉదయించాడు. పక్షులు గూళ్ళు విడిచి తూర్పు దిక్కుకు స్వేచ్ఛగా ఎగురుకుంటూ వెళుతున్నాయి.

'ప్రశాంత్... ప్రశాంత్...' రవీంద్ర కంగారుగా ఇల్లంతా వెతికాడు. హాలులోకి వచ్చాడు. శారద పంజరం ముందు నిలుచుని ఉంది.

"ఇటు చూడండి! !"

రవీంద్ర శారద దగ్గరికి వెళ్ళి చూశాడు. పంజరం తలుపులు తెరచి ఉన్నాయి. చిలక ఎటో ఎగిరి పోయింది.

ఈ సంఘటన జరిగిన పది సంవత్సరాలకి వార్తాపత్రికలో ఒక ప్రకటన పడింది. 'కనబడుట లేదు' అన్న శీర్షిక క్రింద ఒక ఫోటోతోబాటు తప్పిపోయిన ఆ అబ్బాయి బరువు, ఎత్తు, ఇంకా మిగతా గుర్తులు ఇవ్వబడ్డాయి.

ఆ ఫోటో కృష్ణది! !

9-12-1978, ఆంధ్రప్రభ